క్లుప్తంగా

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

రాజానగరం: దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో గురువారం నుంచి ఆదివారం వరకూ నాలుగు రోజుల పాటు సీబీఎస్ఈ క్లస్టర్ 7 వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని 110 సీబీఎస్ఈ స్కూల్స్ నుంచి సుమారు 1400 మంది క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరు కానున్నారు. ఈ పోటీలకు రిఫరీలుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 30 మంది, పర్యవేక్షణకు సీబీఎస్ఈ ఢిల్లీ స్కూల్ నుంచి రానున్నారని శ్రీప్రకాష్ విద్యానికేతన్ కరస్పాండెంట్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు.

వినాయకునికి విశేష పూజలు


సంపరలో ప్రత్యేక అలంకరణ స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపరలో ప్రసిద్ధిగాంచిన సిద్ధివినాయక ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు స్వామివారికి గరికపూజ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా త్రిముఖలింగేశ్వర స్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో ఉన్న శ్రీబాలత్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల అభిషేక ద్రవ్యాలతో స్వామివారిని, అమ్మవారిని అభిషేకించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుధ్య కార్మికుల సభను జయప్రదం చేయాలి


జి.మామిడాడలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

పెదపూడి: ఈ నెల 5న కాకినాడ గాంధీభవన్‌లో జరిగే పారిశుధ్య కార్మికుల సమాఖ్య సభను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు కోరారు. జి.మామిడాడలో బుధవారం పర్యటించి కరపత్రాలు పంపిణీ చేపట్టారు. అంజిబాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సమాజ సంక్షేమం కోసం సేవలందిస్తున్న వారిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి మడికి సత్యం, పారిశుధ్య కార్మికుల సమాఖ్య నాయకుడు బొచ్చా ఏసు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సుజాతకు అవార్డు


జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శి సుజాత

సీతానగరం: మండలంలోని వంగలపూడి పంచాయతీ కార్యదర్శి రేఖపల్లి సుజాతకు ఉత్తమ స్వచ్ఛతా హి సేవ అవార్డు లభించింది. రాజమహేంద్రవరం ఎస్‌డబ్ల్యూపీపీ ఆవరణలో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, డీపీఓ శ్రీనివాసరావు, డీఎల్‌పీఓ నాగలత చేతుల మీదుగా ఆమె అవార్డును, ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికుడు ఉప్పల ఏసు ఉత్తమ స్వచ్ఛతా హి సేవ అవార్డు పొందారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. రాజానగరంతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.


రంగంపేట ఎంఈఓ కార్యాలయం వద్ద బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు


నన్నయ వర్సిటీలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ, సిబ్బంది


పెదపూడి ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు


బిక్కవోలు ఉన్నత పాఠశాలలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గాంధీజీ ఆశయాలు అనుసరణీయం

- వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు
- జాతిపితకు నివాళులర్పించిన నాయకులు, అధికారులు


అనపర్తిలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం వ్యవస్థ, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని దృఢంగా విశ్వసించిన గొప్ప వ్యక్తి మహాత్ముడు అన్నారు. అయితే ఎన్డీఏ పాలనలో బాపుజీ కలలను కల్లలు చేసి గ్రామ ప్రగతిని పాతాళానికి నెట్టేశారన్నారు. సర్పంచ్ వారా కుమారి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, టౌన్ కన్వీనర్ నల్లమిల్లి మోహన్ బాలమురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, బండారు శ్రీను, వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, కోటీశ్వరరావు, ఎం.రామారెడ్డి, తేతలి బుల్లిరెడ్డి, పడాల శ్రీను, చింతా రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: ప్రతిఒక్కరూ గాంధీజీ బాటలో పయనిస్తూ సమాజహితంగా జీవనం సాగిద్దామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని బుధవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, మానవతావాదిగా ఎదిగిన గాంధీజీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. లాల్ బహుదూర్‌శాస్త్రి భారతదేశ ప్రధానమంత్రిగా దేశాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా నియోజకవర్గవ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక హర్షవర్ధన స్కూల్‌లో మండలంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత సంఘ ప్రతినిధి జి. అప్పారావు ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటరులోని మహాత్ముని విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగంపేట: గాంధీ మహాత్ముని ఆశయాలను అందరూ అనుసరించాలని జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా సుభద్రంపేట గ్రామంలో సర్పంచ్ కూటి సాయితాతారావు అధ్యక్షతను జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీ మార్గాన్ని యువత అనుసరించి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మర్రిపూడిలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా పెదరాయవరం, కోటపాడు, జి.దొంతమూరు, దొడ్డిగుంట, రంగంపేట గ్రామాల్లో సర్పంచ్‌లు బరగటి సుజాత, గవరసాని లక్ష్మీదుర్గ, గోలి రమణ, బలిరెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరిగాయి. ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద ఎంపీడీఓ పి.వెంకటరత్నం, ఎంఈఓ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, ఉప సర్పంచ్, బలిరెడ్డి దుర్గారావు, వేము చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: దేశానికి స్వాతంత్ర్యం సాధించిన బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ సందర్భంగా గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి, నాగరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండటానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. జి.మామిడాడ గ్రామంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి, పూలమాలలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, సర్పంచి లంక మున్ని, సచివాలయం కార్యదర్శి ఎస్.కనకనాగేంద్ర కుమార్, మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి, ఆర్.నాగు, తమలంపూడి శివరామారెడ్డి, జుత్తుక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహాత్ముడి బాటలో పయనిద్దామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రాజానగరం జీఎస్ఎల్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల ముగింపు, గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జీఎస్ఎల్ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్ అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. ఎంపీడీఓ పి.వెంకటరత్నం, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరికృష్ణ, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా మహాత్మ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా అనపర్తిలో బుధవారం గాంధీజీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అనపర్తి మెయిన్‌రోడ్డులో స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం ఎమ్మెల్యే పాల్గొన్నారు. చీపురుతో రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బాపూజీ కన్న కలలను సాకారం చేద్దామని ఎంఈవో-1 సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయుడు జంగా శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతానగరం: మండలంలో మహాత్మగాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి.రామ్‌ప్రసాద్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీఓ కె.రమేష్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ మూర్తి, ఏఓ గోపాల్ పలువురు అధికారులు పాల్గొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్, ఎస్సై డి.రామ్‌కుమార్, ఆశ్రమ ప్రతినిధి సుశీల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రఘుదేవపురంలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటి మూర్తి, ఆర్ఐ లక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలవ్యాప్తంగా బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, ఏఈలు మదర్షా, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు. కోరుకొండ, గాడాలలో గాంధీ విగ్రహాలకు స్థానిక నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


రఘుదేవపురంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ


అనపర్తిలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

వరిలో తెగుళ్ల నివారణా చర్యలు అవసరం


వెంకటాపురంలో సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రంగంపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిలో ఎండాకు, దోమపోటు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని, వీటి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వెంకటాపురం, కోటపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంటలను పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి ఈనిక దశలో ఉందని, ఎండాకు తెగులు సోకిన పొలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే పిలకలు ఎండిపోయి వెన్నులు సరిగా రాకపోవడం, లేదా తాలు గింజలు ఏర్పడతాయన్నారు. వెంటనే ఎండాకు తెగులు నివారణకు కాపరాసిక్ క్లోరైడ్, ప్లాంటామైసిన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. 20 కిలోల పొటాష్ వేయాలన్నారు. దోమపోటు నివారణకు ఎసిఫేట్ 75 శాతం ఎకరానికి 300 గ్రాములు, ట్రిఫిలిమ్ 20, ఫైరిమ్ 10 శాతం ఎకరానికి 94 మిల్లీ లీటర్ల నీళ్లలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఎలుకల నివారణకు నూకల్లో కలిపిన బ్రోమోడయోలిన్ మందును రైతులకు సరఫరా చేశారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ పామాయిల్ మొక్కలను నూరు శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు రాయితీపై అందిస్తున్నామన్నారు. రైతులు, గ్రామ పెద్దలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు పదిమంది విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: పందలపాక పడాల పెద్ద పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత, మహిళ జూనియర్ కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19, 17, 14 పోటీలకు పది మంది బాలికలు ఎంపికయ్యారు. వీరిలో అండర్-14 స్విమ్మింగ్‌లో కొమ్ము జాహ్నవి, అండర్-17 సిమ్మింగ్ విభాగంలో తిలపూడి ఉమా వైష్ణవి, అండర్-19 హ్యాండ్ బాల్ విభాగంలో గొల్లపల్లి భవాని, నడిపూడి లోహిత ప్రియ, అండర్-19 వాలీబాల్‌లో పాకలపాటి దివ్య, వెదురుపాక లీలా శైలజ, అండర్-19 ఖోఖో విభాగంలో వైరాల సుష్మిత, బనిశెట్టి పావని, సంతోష్ తదితరలు ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19, 17, 14 బాలికల ఎస్‌జీఎఫ్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టులో ఆడనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. క్రీడాకారులను వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డిను అభినందించారు. కార్యక్రమంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యథావిధిగా మాంసం విక్రయాలు


కొమరిపాలెంలో మాంసం విక్రయిస్తున్న దుకాణం


కొమరిపాలెంలో బిర్యానీ హోటల్‌లో మాంసాహారాన్ని అమ్ముతున్న వ్యాపారులు

పట్టించుకోని అధికారులు

బిక్కవోలు: స్వాతంత్ర్య సముపార్జన కోసం జీవితాన్నే అంకితం చేసిన జాతిపిత మహాత్మా గాంధీకి ఘనమైన నివాళి అందించడానికి గాంధీ జయంతి రోజున ప్రభుత్వం మద్యం, మాంస విక్రయాలను నిషేధించింది. ఇదేమీ పట్టించుకోకుండా మండలంలోని కొమరిపాలెం గ్రామంలో మాంస విక్రయాలు విచ్చలవిడిగా జరిగాయి. కొందరు వ్యాపారులు దుకాణాలు మూసి ఉంచినా, విష్ణు చికెన్ సెంటర్‌లో మాంస విక్రయాల కొనసాగాయి. అలాగే ఇక్కడున్న మూడు బిర్యానీ హోటళ్లలోనూ మాంసాహార విక్రయాలు చేశారు. పంచాయతీ అధికారులు తమకె ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, అందుకే అమ్మకాలు సాగిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. దసరా ఉత్సవాలు ముందుండడంతో భారీఎత్తున ప్రజలు క్యూలో నిలబడి చికెన్ బిరియానీ కొనుగోలు చేయడం కనిపించింది. అయితే ఇవేమీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కానరాలేదు. కొన్నిచోట్ల బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు ఉదయం నుంచీ సాగాయి. ఎక్సైజ్ అధికారుల జాడ ఎక్కడా కానరాలేదు. దీనిపై కొమరిపాలెం పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాసరెడ్డిని వివరణ అడగ్గా, ముందుగానే ప్రతి అమ్మకందారులకు చెప్పామన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం ప్రారంభం


బూరుగుపూడిలో వర్మీకంపోస్టును ప్రారంభిస్తున్న అధికారులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని బుధవారం అధికారులు ప్రారంభించాది. తడి చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మహేశ్వరప్రతాప్, సెక్రటరీ జాకబ్‌రాజు, స్థానిక నాయకులు కంటే నాగేశవరావు, సత్యచక్ర గణపతి, అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఉపాధి హామీ పథకం కూలీలు బుధవారం ఆందోళనకు దిగారు. పనులకు వెళ్లకుండా సమ్మె చేయాలని నిర్ణయించు కున్నారు. స్థానికుడు వెంకన్న కూలీలపై దూర్భాషలాడి, అవమానించడంతో ఆందోళన చేపట్టారు. కూటమి నేత కంటే కేశవరావు అతనితో కూలీలకు క్షమాపణలు చెప్పించడంతో ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ పనులు చేస్తున్న తమపై నాయకుల అజమాయిషీ ఎక్కువైందన్నారు. కూలీలను చిన్న చూపు చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సారా నివారణకు చర్యలు


ఎక్సైజ్ సీఐ శ్రీనివాసబాలాజీ

మధురపూడి: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే సారాను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని ఎక్సైజ్ శాఖ కోరుకొండ సీఐ జె.శ్రీనివాస బాలాజీ అన్నారు. మచిలీపట్నం నుంచి కోరుకొండకు బదిలీపై వచ్చిన ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నూతన మద్యం పాలసీలో భాగంగా కోరుకొండ సర్కిల్‌కు 12 మద్యం షాపులు వస్తాయని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో స్వచ్ఛతాహి సేవ


అనపర్తి జీబీఆర్ కాలేజీలో గ్రీన్ పాత్‌ను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెదపూడి: గత 15 రోజులుగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని అనపర్తి జీబీఆర్ కాలేజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ అబ్బాయిరెడ్డి అన్నారు. బుధవారం స్వచ్ఛతాహి సేవ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో గ్రీన్ పాత్‌పై చెత్తను శుభ్రం చేశారు. ముందుగా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు సీహెచ్ ఆనందరావు, పి.వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: గొందేశి పూర్ణచంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక బాలాజీ సెంటర్‌లో గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు, గొడుగులు అందజేశారు. వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో, వృద్ధాశ్రమాల్లో భోజనం ఏర్పాటు చేశారు.

దసరా వచ్చిందయ్యా...

- నేటి నుంచి శరన్నవరాత్ర వేడుకలు
- సుందరంగా ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- గ్రామాల్లో పండగ వాతావరణం


ఊలపల్లిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బిక్కవోలు: పల్లెలో దసరా సందడి నెలకొంది. దేవీ శరన్నవరాత్ర వేడుకలను పురస్కరించుకుని గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాల్లో గురువారం నుంచి ఈ నెల 12 వరకు దసరా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దుర్గమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారు. కనక దుర్గమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

చలువ పందిళ్లు రెడీ

నియోజకవర్గంలోని ఊరూరా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో తలమునకలయ్యాయి. ఇప్పటికే రాట ముహూర్తాలను నిర్వహించారు. బిక్కవోలు, బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, ఊలపల్లి, తదితర గ్రామాల్లో ఘనంగా శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలోని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక మంటపాలు ఏర్పాటు చేసి, దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

అమ్మవారి అలంకరణలు ప్రత్యేకతలు

బాలాత్రిపుర సుందరీదేవి: అమ్మవారు లక్ష్మి, పార్వతి, సరస్వతీ అమ్మవార్ల ముగ్గురూ హంసలను కలిగి బాలా త్రిపుర సుందరి రూపంలో ఆదిశక్తిగా సకల సృష్టి, ఆలయాలను పర్యవేక్షించే అమ్మవారిగా పూజిస్తారు.


కొమరిపాలెంలో ఉత్సవాలకు ముస్తాబైన కనకదుర్గమ్మ ఆలయం

- అన్నపూర్ణాదేవి: తన శక్తితో సకల జీవకోటికి అవసరమైన ఆహారాన్ని అందిస్తుందని భక్తుల నమ్మకం. పంటలు సమృద్ధిగా పండి, ఆహార కొరత లేకుండా ఉండాలని కోరుతూ అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని పూజిస్తారు.
- మహాలక్ష్మీదేవి: సర్వ లోకాలకు, బ్రహ్మాది దేవతలకు ఆరాధ్య రూపం లక్ష్మీదేవి అమ్మవారిని కొలిస్తే లక్ష్మీకటాక్షం కలుగుతుందని పూజస్తారు.
- గాయత్రీదేవి: 24 మంది దేవతలు బీజాక్షరాలు ఉన్న గాయత్రి మంత్ర పఠనంతో తేజస్సు, సకల సౌఖ్యాలు కలుగుతాయి.
- సరస్వతీదేవి: ఈ అవతారంలో అమ్మవారిని పూజిస్తే మానసిక పరిపక్వత సాధించి జ్ఞాన సముపార్జన, విద్యాబుద్ధులు కలుగుతాయని నమ్మకం
- లలితాదేవి: ఈ అలంకరణలో అమ్మవారిని పూజిస్తే ఉత్తేజితమైన ఆలోచనలు కలుగుతాయని విశ్వాసం.

మహిషాసురమర్దిని: ఈ అవతారంలో అమ్మవారిని కొలిస్తే మంచి బుద్ధి సిద్ధించడంతో పాటు మనిషిలో ఉన్న చెడు ఆలోచనలు తొలగి సకలకార్యాలు సిద్ధిస్తాయని నమ్మకం.

- రాజరాజేశ్వరీదేవి : ఈ అవతరంలో అమ్మవారిని పూజిస్తే ప్రాణకోటి రక్షణకు సకల విజయాలు, శుభాలు కలుగుతాయని నమ్మకం